## 12. శంకర పార్వతీయం

**శంకరం** మామయ్య రాక రాక మా యింటికి వొచ్చాడు. అందరికీ సరదా వేసింది. రకరకాలుగా సరదా వేసింది.

నాన్నకి ఫోన్ చేశా, పక్కింటికెళ్ళి. నాన్న ఫోన్‌లోనే సంతోషం వెలిబుచ్చారు. శంకరం మామయ్యని తను వొచ్చేవరకూ ఎంగేజ్ చెయ్యమన్నారు.

మామయ్య ఇంట్లోకి రాగానే పార్వతత్త ఇంట్లోకి పరుగెత్తి వంటింట్లో మామ్మతో చెప్పింది. మామ్మ వంట మానేసి శంకరం మామయ్యని పలకరించడానికివతలి కొచ్చింది. మామ్మ వెనకాలే అమ్మకూడా వొచ్చింది. ఎవరితోనూ అనవసరంగా మాటాడని అమ్మ శంకరం మామయ్యతో పదినిమిషాలు మాట్లాడింది.

శంకరం మామయ్య మాకు అంతదూరమూ దగ్గిరా కాని బంధువు. చిన్నప్పుడు పార్వతత్తని అతనికిచ్చి పెళ్ళి చెయ్యాలనుకునేవాళ్ళు. కాని కాలక్రమాన పెద్ద చదువులు చదివి మామయ్య కొరకరాని కొయ్య అయిపోయి ఎవరిమాటా వినటం మానేశాడు. మొదట్లో చదువు పూర్తయ్యాక పెళ్ళి సంగతి చూసుకుందామనేవాడు. తరవాత్తరవాత చదువు అయిపోతే మటుకు పార్వతినే చేసుకోవాలని రూఢిగా నిర్ణయం లేదనేవాడు. అవైనా వాళ్ళ నాన్నతోటీ అమ్మతోటేగాని మా దాకా వొచ్చేవేకావు. అసలు శంకరం మామయ్య మేమెవ్వరం గుర్తుపట్టలేనంత కాలం మాకు కనిపించలేదు. అందుకనే కొద్దికొద్దిగా తెలుస్తున్నప్పట్నుంచీ నేను కూడా పార్వతత్త పెళ్ళి విషయంలో అందరూ ఈ శంకరంగార్నే ఎందుకు ఎంచుకోవాలి అని అడిగేదాన్ని. పై సంబంధాలు వెతికితే పార్వతత్తకి పెళ్ళి ఎప్పుడో అయిపోయేదని నా నమ్మకం.

మొన్న మూడునెల్లక్రితం నేనూ, పార్వతత్తా, అమ్మా, నాన్న రాజశేఖరం తాతయ్యగారింట్లో జానికమ్మ పిన్ని పెళ్ళయితే వెళ్ళాం. రాజశేఖరం తాతగారు శంకరం మామయ్యకి పెత్తండ్రేగా! ఆ పెళ్ళికి ఈయనా వొచ్చాడు; పెళ్ళిలో మేం వున్న రెండు రోజుల్లోనూ నాన్నతో ఈ శంకరం మామయ్య ముక్తసరిగానయినా మాట్టాడలేదు. మేం ఇంటికొచ్చి ఆమాటే అనుకున్నాం. దాంతో నాయనమ్మ పెదవి విరిచేసి "అబ్బే! వాడు దీన్ని చేసుకోడురా! ఇహ అడిగి లాభంలేదు" అని తొంభై తొమ్మిదోసారి అన్నది - నేనే పార్వతత్త అయితేనా, నేనే అతన్ని చేసుకోనని గట్టిగా చెప్పేద్దును. ఏమిటి? అతని గొప్పేమిటి? అనిపిస్తుంది నాకెప్పుడూ. కాని పార్వతత్త వాటం చూస్తే నాకు కడుపులో తిప్పేది. శంకరం మామయ్య ప్రసక్తి వొచ్చేసరికి సిగ్గుపడిపోయి అక్కణ్ణించి వెళ్ళిపోయేది.

పెళ్ళినించి మేం వొచ్చిన రెణ్నెల్లకి శంకరం మామయ్య తమ్ముడు రవి తుని వెళుతూ

మా యింటికొచ్చేడు, అతన్తో నాయనమ్మ అవీ ఇవీ మాట్లాడుతూ, "పార్వతత్తకి ఇహపై సమ్మంధాలు చూసుకోడమే, శంకరం ఇలా మొండి చెయ్యి చూపించా"డని అంటూ ఇదయింది. దాంతో అతను చాలా ఆశ్చర్యపడి పోయి "అరె! మీకింకా తెలీదా? అన్నయ్య పార్వతిని పెళ్ళాడతానని నాన్నకి చెప్పి పదిహేనురోజులు దాటిందే!" అన్నాడు.

దాంతో అందరికీ మతులు పోయాయి.

నాన్న ఆ రాత్రికి రాత్రి శ్రమపడి రెండురోజులు శెలవు సంపాదించాడు; మర్నాడు పొద్దుటే విజయనగరం వెళ్ళాడు.

❖ ❖ ❖

పార్వతత్త సహజసౌందర్యం గలది. నా దృష్టిలో అందమైంది అంటే దానికి కనీసం తిరుగులేదన్న మాట. నాన్న నా నిర్ణయాన్ని చాలా ఆమోదించేవారు. అందరాడపిల్లల్లాగా కాకుండా చదువు నాకు సరైన పద్ధతిలో అందిందనే వారు నాన్న.

పార్వతత్త చాలా అందంగా వుంటుంది. గాని చదువెరగదు. తాతయ్య పోయేవరకూ నాన్న ఆమెని పల్లెటూళ్ళో వొదిలెయ్యడం వల్ల ఆమెకి చదువు అంటలేదు. చదువే కాదు; సంస్కారమూ విమర్శనాజ్ఞానం యిలాటి విద్యాధారపు విలువలు ఏవీ అంటలేదు. దీనితోపాటు పిత్రార్జితం అంతా అప్పూ సప్పూ తీర్చడానికే సరిపోయెగాని అత్త పెళ్ళికి కేటాయించడానికంటూ ఏమీ లేకపోయింది. ఇలా చదువూ, డబ్బూ రెండూ లేకపోవడాన్ని పార్వతత్త ఏళ్ళు పెరుగుతున్న కొద్దీ నాన్నకి కొంచెం కొంచెం బరువెక్కింది.

శంకరం మామయ్య ఒస్తూనే 'అత్తా!' అని కేకేశాడు.

పార్వతత్త పరుగో, పారిపోయింది వంటింట్లోకి.

అతను జోళ్ళు విప్పుకుంటూ వుంటే నాయనమ్మ ఒచ్చింది. వెనకాలే అమ్మ వొచ్చింది. ఆ వెనక పార్వతత్త చీరవొస్తోంది.

నాయనమ్మకి మొహమంతా సంబరమే. మాటే రాలేదు.

సావిట్లో హేండ్ బ్యాగ్ పెట్టబోతూ వుంటే అమ్మ అడ్డుపడి తీసుకుపోయి మధ్యగదిలో పెట్టించింది.

'పరాయి వాళ్ళలాగ సావిట్లో పెట్టేస్తున్నారేం సంచీ?' అన్నాను నేనూ మాటకలిపి.

ఆయన నాకేసి చూశాడు. 'ఈ పిల్ల ..... బావకూతురేనా అత్తా?, అన్నాడు అనుమానంగా.

'అవును నాయనా, నువ్వెరగవూ?' అంది మామ్మ.

'ఎరగనత్తా. చిన్నప్పుడు చూశాను గాబోలు. అయినా బావకి ఇంత కూతురుందని అనుకోలేదు.'

'మొన్న జానకి పెళ్ళికదీ వొచ్చిందే.....' అంది అమ్మ -

మామ్మ కాఫీ పెట్టించడానికి వంటింట్లోకి వెళ్లింది. శంకరం మామయ్యని ఇతర ప్రశ్నలు అడుగుతోంది అమ్మ. 'మీ అమ్మా వాళ్ళు బాగున్నారా' అంటూను.

నాన్నకి ఈ భోగట్టా చెప్పడానికి ఫోనుకోసం నేను పక్క వాళ్ళింటికి వెళ్ళాను. ఆయన ఎలా సంతోషిస్తారో చూదామని అనిపించింది.

❖ ❖ ❖

మామయ్యకి కాఫీ ఇస్తూ 'పార్వతత్త మిమ్మల్ని చూడగానే కాఫీ చేసిందండీ. అందుకే ఇంత అర్జంటుగా తయారయింది' అన్నాను.

అతను మాటాడలేదు. కాఫీ బాగుంది కాబోలనుకున్నా.

'ఏం చదువుతున్నా వమ్మాయ్?' అన్నాడు.

'ఇంటరు పార్టువన్ తప్పానండీ' అన్నాను. నాకేం అతన్తో మాటాట్టానికి మొహమాటమా?....

'వ్వాట్! అప్పుడే ఇంటరూ! వాట్స్ యువర్ ఏజ్?'

'అతను 'వ్వాట్' అంటూంటే ఏదో బాగుంది. చాలా అర్థవంతంగా కూడా వుంది.

'పదిహేడో ఏడొస్తోంది. స్కూలుఫైనల్లో వయస్సు చాలదని ఏదో గడబడ చేశారు కూడానూ, మళ్ళీ మార్కులూ అవీ చూసి డి.ఇ.వో. గార్కి రిపోర్టు రాస్తే కట్టనిచ్చారు' అంది అమ్మ.

'వ్వాట్! మరి ఇంటరు పోయిందేం, ఆ మార్కులు ఇంటర్లో రాలేదా?'

'ఔనండీ-నాక్కొంచెం ఇంగ్లీషులో డౌట్' అన్నాను.

'అరే! ఇంగ్లీషులో డౌటా?..... నాకెప్పుడూ వుండేదిగాదు' అని కొంచెం నింపాదిగా అనుకున్నాడాయన. 'మరి మీకెందులో?' అన్నా నవ్వి.

'సారీ, నాకెందులోనూ డౌటు వుండేదిగాదు' అని అతను నవ్వాడు.

హేండ్ బ్యాగ్‌లోంచి ఏదో తెలుగు నవల తీశాడు శంకరం మామయ్య. అమ్మ మెల్లిగా అక్కణ్ణించి వెళ్ళింది ఏదో చెప్తూ. అమ్మ ఏం చెప్పిందోనన్నా వినకుండా నేను పుస్తకంకేసి చూస్తున్నాను.

ఈజీ చైర్‌లో పడుకున్న మామయ్య పుస్తకం విప్పగానే నవల పేరు కనబడింది. అది నేను చాలా రోజుల్నించీ ఇష్టపడి సంపాదించలేక పోతున్నది.

'అరె! గృహదహనమా? చదివేశారా?' అన్నా?

'వ్వాట్! కావాలా?'

'అహా! మీరు చదివే య్యివ్వండి.'

'లేదు లేదు-చదవండి. నేను చదవడం ఏనాడో అయింది. నా కేదేనా పత్రిక

పడెయ్యండి' అంటూ పుస్తకం నావేపు విసరబోయాడు.

నేనే వెళ్ళి తీసుకున్నాను. వెళుతున్నంత సేపూ అతనికేసే చూశాను. అతనూ చూశాడు. ఆ చూపుల్లో ఎంత శక్తి వుందని! ఎవరి చూపుల్నైనా ఠపీమని కిందకి దింపే నా తీక్షణ దృక్కుకి అతను నిటాగ్గా నిలబడి జండాలా ఎగిరేడు -

❖ ❖ ❖

మామయ్య ఒక రాత్రీ రెండు రోజులూ వుండి వెళ్ళాడు. ఇంకా వుండమని అమ్మా, నాన్న, మామ్మా అన్నారుగాని ఉద్యోగం వొప్పుకోదన్నాడు. ఏదో ప్రమోషను విషయంలో ఎవరో ఆఫీసరు దగ్గిరికొచ్చాట్ట. శలవాట్టే పెట్టలేదనీ ఈమారొచ్చినప్పుడు మూడ్రోజులు వుంటాననీ అన్నాడు.

మామయ్య అందరూ అనేటంత కరుగ్గా లేడనే నాకు బోధపడింది. కాని నే నీ మాట అనేసరికి అందరూ ఎదురు తిరిగారు. నా తర్కజ్ఞానమూ, వాదనా వృథా అయ్యాయి. మామయ్య శుద్ధ డాబూ, మహాబెట్టూ అన్నారు.

మామయ్యమాట కర్రవిరిచి పొయ్యిలో పెట్టినట్లుంటుంది. మన ప్రశ్నకి అతను జవాబే చెప్పవలసి రావాలిగాని, మళ్ళీ మనకి ప్రశ్నవేసే అవకాశం ఇవ్వడు. అది చూసి తలబిరుసంటే అన్యాయమే -

అభిప్రాయాలను ప్రవర్తన చూసికూడా మార్చుకోలేరు కొందరు. మావాళ్ళు అందులో చేరతారు.

మామయ్య సరదా అయినవాడు. సరదాతో సమయస్ఫూర్తి వుంది. ఉన్న ఒకే ఒక దుర్గుణం అజాగ్రత్త. పరాకు. ఆలోచనలో వుంటే ప్రపంచం మరిచిపోవడమే.

అతను వొచ్చిన మర్నాడే కాబోలు, కిటికీ పక్కని ఈజీ ఛైర్లోంచి సిగరెట్టు విసిరేస్తే అది ఎక్కడో పోయి పడాల్సింది. వాకిట్లో తాడుకి వేలాడేసిన నాన్న చొక్కా జేబులో పడింది. చొక్కా పూర్తిగా పనికిరానంతగా కాలిపోయాక "ఎక్కడో గుడ్డ కాలిన వాసనేస్తూంది. వంటింటిలో వాళ్ళు చూసుకోండోయ్" అని కేక పెట్టాడు.

అసలు సంగతి చూసి అందరూ గొల్లున నవ్వారు.

ఏమో, నేనతన్నీ అతని పరధ్యానాన్నీ క్షమించి భరించాను. ఆలోచనలలో వున్నప్పుడు ఆమాత్రం పరధ్యానం ఉండదా ఏం మరి?

"నిద్దరొస్తోంది. ఇలా వొళ్ళు వాల్చిపడుకుని వుంటాను. ఎవరేనా పుస్తకం చదివితే అయిదు నిమిషాల్లో వొస్తుంది నిద్ర" అన్నాడు మామయ్య.

"నే చదవనా?" అన్నా

"ఓ; థాంక్సు."

నేను పుస్తకం తీసి ఏదో కథ చదువుతున్నా;

"బాగా స్పీడుగానే చదువుతున్నావు. తప్పులు రావటం లేదు" అన్నాడు.

"బాగుంది. తప్పులు కూడా రావాలా ఏమిటి?"

"అది కాదుగాని పార్వతి ఇలా చదవగల్దా?"

"ఓహో అదా మీ సందేహం?" మామయ్య ఆలోచనకు నాకు సరదా వేసింది. తృప్తిగా నవ్వుకున్నాను "తెలుగయితే బాగానే చదువుతుంది. మధ్య మధ్య ఇంగ్లీషు మాటలొస్తే అక్కడ హాల్టు. ఎటొచ్చీ రైటింగు కొంచెం పెద్ద సైజు అంతే - అయినా మీరు వూరుకుంటారా? మీ సావాసం వారంరోజులు చాలు. ఎడ్యుకేషను రావడానికి" అన్నా.

"వ్హాట్? అంత ఉబ్బేస్తున్నా వేంటి నన్ను?"

"కాకపోయినా అత్తయ్యకున్న గ్రహింపుశక్తి అలాంటిది."

"పోనీలే ఆమాత్రం వుంటే చాలు" అని మామయ్య నవ్వాడు.

"మీకు నిజంగా నిద్రరావటం లేదు" అంటూ లేచి ఇవతలికి వచ్చాను. గది తలుపుదగ్గిర పార్వతత్త వుంది. నేను బిగ్గరగానే "పార్వతత్తా! నువ్వీ పాటికి ఎబీసిడీలు మొదలుపెట్టడం మంచిది. పెళ్ళవగానే మామయ్య నిన్ను ఫస్టుఫారంలో చదవేస్తారట" అన్నా నవ్వి.

'ఫో;' అని నాకన్నా మూడేళ్ళు పెద్దయిన పార్వతత్త నా దగ్గిర సిగ్గుపడింది.

నెల తిరక్కుండా మామయ్య మళ్ళా వొచ్చాడు. ఈసారి అందరూ అంత సరదాపడలేదు. కాని అదేం కనబడలేదు బైటికి.

ఒచ్చినరోజు సాయంకాలం సినిమాకి వెళదాం రమ్మన్నాడు. నాన్న ఏడుగంటలదాకా ఇంటికి రారు. పార్వతత్త మామయ్యతో సినిమా మాట అటుంచి వంటిల్లు దాటి ఇవతలికి రాదు; రానంది, అమ్మ పెద్దా కాక చిన్నా కాక రానంది. నాకు మట్టుకు తప్పలేదు.

నాలుగింటికి ఆలోచించుకున్నవాళ్ళం. నాలుగున్నరకే బయలుదేరాం. అలా మెయిన్ రోడ్డంట నడుస్తూ సరస్వతీ రీడింగురూం, టవున్‌హాలూ, బీచి చూసుకొని లైట్ హవుస్ దగ్గిర చేరాం. లైట్ హౌసు ఎక్కి మళ్ళీ వొచ్చి బీచిలో కూర్చున్నాం.

బీచిలో గంట కూర్చున్నాం. ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. అతను అడగని దంటూ లేదు. చిన్నప్పట్నుంచీ నేనెలా పెరిగానో, పార్వతత్త ఎలా పెరిగిందో- నాన్న మద్రాసు సెంట్రల్‌జైల్లో పనిచెయ్యడం, అప్పటి నాన్న సైకాలజీ - ఒక్కోనాడు ఏదైనా మరణదండన అమలుజరిపి వొచ్చినప్పుడు సాయంకాలం ఆయనపడ్డ బాధ - అన్నీ నేను చెప్తే మానవ హృదయంమీద ఎంతో చక్కగా మాట్లాడాడు. ఎంతో ప్రాపంచికంగా ఆలోచిస్తాడు మామయ్య. అతను చెప్పేవి అన్నీ తార్కికంగా వుండి వినేవాళ్ళని మాట్లాడనివ్వవు.

జీవితంలో - నాన్నకీ, అమ్మకీ, పార్వతత్తకి - నాకూ, ఎవరికెలాటి సమస్య లుంటాయో అన్నిటి గురించీ మామయ్యతో నేనాగంటలోనూ చర్చించాను. ఆరుగంటలు అయిపోతున్నకొద్దీ కష్టమనిపించేసింది. నా గురించి తన భావన సరిపోయిందన్నాడు. తను అన్నీ సరిగ్గా ఊహించగల ననడానికి నేనే సాక్ష్యమట.

"ఎంత ప్లెయిన్‌గా మాట్లాడతారండీ మీరు!" అన్నా ఆశ్చర్యపడి.

"వ్హాట్! ప్లెయిన్‌గా మాట్లాడక?" అన్నాడతను ఏదో ఆనందంలో.

నేనూ ఆయన 'వ్హాట్' అంటుంటే చాలా సరదాపడి 'వ్హాట్' అన్నాను.

"ఓహ్. అది నా వూతపదమని కనిపెట్టేశావా? యువార్ అఫ్‌కోర్స్ టూలేట్" అని నా చెయ్యి పట్టుకున్నాడు.

నేను నవ్వుతూ మెల్లగా చెయ్యి విడిపించుకున్నాను.

"ఏమట్లా నవ్వుతావ్?.... లేదామా" అని లేచాడాయన.

లేచాను. మౌనంగా బస్సు రోడ్డుమీదికి నడిచివొచ్చాం. సిటీబస్ మీద మార్కెట్టువరకూ వెళ్లాం. అక్కణ్నించి సినిమాకు పోయాం.

సినిమానించి ఇద్దరం ఒక్క రిక్షాలో రావడం నాకే కొంచెం ఇబ్బందిగా అనిపించింది. అదీ ఇంటికొచ్చేముందు మరీనూ. ఆయన రెండు రిక్షాలు పిలవడమేమో పిల్చాడు. కాని నేనే "ఎందుకులెండి, దండగ" అన్నా.

మామయ్య నా ఇబ్బంది గమనించి 'నువ్వు సరిగా ఉండటం లేదు. నేను దిగి నడిచిరానా, ఇల్లు దగ్గరయింది?' అన్నాడు.

అంత దగ్గిర్లో దిగి నడవడమూ నాకు అంత సమంజసంగా అవుపించలేదు. అది అంతకంటే అసౌఖ్యంగా వుంటుందనిపించింది.

ఏమైనా అతన్ని దిగనివ్వలేదు.

మర్నాడు పొద్దుట మామయ్య మామ్మతో ఫిర్యాదు చేశాడు. 'మీ ఇంటికొస్తే ఏమీ తోచదత్తా' - అని 'ఎవరూ మాట్లాడ్రు. అలా ఈ పుస్తకాలు ఎంతకని చదవనూ? - ఇహ ఇప్పట్లో మీ ఇంటికి రాకూడదు.'

"ఆఁ అవునుమరి. అయినా మా మాటలు మీకేం రుచిస్తాయి? పుస్తకాలో, సినిమాలో వుండాలి మీకు. ఇప్పుడు మా జానకే వుందనుకో. దాని పుస్తకాలేమిటో స్నేహితులేమిటో గాని మాతో అసలు మాట్లాడదే!" అని సోది ప్రారంభించింది మామ్మ.

❖ ❖ ❖

ఆ సాయంకాలం మూడున్నరకి మామయ్య "ఏం జానకీ - ఎటేనా వెడదామా ఇవ్వాళా? నిన్నట్లా కబుర్లు చెప్పుకొంటూ...." అని అడిగాడు.

నాకు నిన్నటి సమావేశం అసంపూర్ణంగానే కనబడింది. కాని "ఎందుకు లెద్దురూ" అనేశాను.

"ఇవ్వాళ యూనివర్సిటీకేసి వెడదాం. నేను చదువుకొనేటప్పుడు కూడా యూనివర్సిటీ బిల్డింగ్స్ చూడలేదు."

"సరే వెళదాంలెండి. ఇంకో గంట పోయాక బయల్దేరుదాం" అన్నా.

నాలుగయ్యేక బయలుదేరాం. యూనివర్సిటీ బిల్డింగ్సు చూసి అతనంత

ఆశ్చర్యపోడం నేను ముందుగా ఊహించలేదు. శలవులవటాన్ని ఏదీ తెరిచిలేదు. హాస్టల్సులో మట్టుకు ఇంటికి వెళ్ళని స్టూడెంట్సు అక్కడక్కడ వున్నారు. వినయ విహార మేడమీద అంతస్తుకి ఎక్కి ప్రకృతి చూద్దాం. "వాల్తేరు ఊరు చూచి బీచికి వెళదాం" అన్నాడు మామయ్య.

బీచిలో కూచుని సుమారు ఒక ప్యాకెట్టు సిగరెట్ల దాకా కాల్చేశాడు మామయ్య. అయిదయిపోయేసరికి లోకంమీద మాకు సంబంధించిన భోగట్టాలూ అయిపోయాయి.

శంకరం మామయ్య నిశ్చలంగా ఆలోచిస్తున్నాడు. నేనతన్ని కదల్చక ఇసకలో ఏవో బొమ్మలు వేసుకుంటున్నా. మధ్య మధ్య అతనికేసి చూస్తే సాగర గాంభీర్యం తప్ప ఏ కదలిక లేదు.

ఒక్కసారి 'జానకీ!' అన్న పిలుపుతో ఇటు తిరిగాను.

"ఒక్కమాట చెప్తాను వింటావా?..... దీంట్లో నీ సలహా కూడా తీసుకోందే ఏ పనీ చెయ్యలేననుకో-"

అతనికి నేను సలహా చెప్పేపాటి దాన్నా అని నాలో నాకే అనిపించింది. అంతగా నన్ను నేనెప్పుడూ చిన్నబుచ్చుకోలేదు. అదే అన్నాను.

"మరేంలేదు. ఇది నీకు కూడా సంబంధించిన విషయం గనక, లేకపోతే నాకెవరి సలహా అక్కర్లేకపోను. అయినా నీలాంటి వాళ్ళ సలహా దేంట్లోనయినా అవసరమే అని నువ్వే రుజువు చేసుకున్నావులే-దానికేంగాని - నేనీసారి విశాఖపట్నం రావడం నీకోసమే అని నీకు తెలుసా?"

"నా కోసమా?"

"నీకు తెలీకపోడం అన్యాయం. పోన్లే ఐ డోంట్ మైండ్. ఈసారి నీ కోసం వొచ్చాను. నిన్ను ఒదల్లేక ఈ నెల్లాళ్ళూ కష్టపడి చివరికి ఒచ్చాను. నిజానికి ఈ నెల్లోనూ నేను పూర్తిగా నీవాడినై పోయాను. నేను పొరపాటు చేస్తున్నానా అని రెండు మూడు సార్లు అనుమానం కలిగింది. అది తేల్చుకోడానికే నేనీసారి రావడం. కాని ఎంత చూసినా నీమీద గౌరవం, కాంక్షా ఎక్కువయి పోతున్నాయిగాని మరోలా అవడం లేదసలు.

నాకు నోటంట మాటలు రావటం లేదు.

"-ఈ మార్పు-అంతా ఒక పెద్ద ప్రోసెస్సు. క్రమంగా నీకు వినిపిస్తాననుకో. ఒక్కటి చెప్పు. పార్వతిని కాదని నిన్ను పెళ్ళాడ్డం నీకు యిష్టమేనా?"

అలా డవున్ రైట్‌గా అడిగితే ఏం చెప్పను?

"అఫ్‌కోర్సు, నీకు నామీద నమ్మకం కుదరడం కష్టమేనని నాకూ తెలుసు. ఒక్క నెల్లాళ్ళలో ఇలా మారిపోయిన నేను ఇకముందు మట్టుకు తిన్నగా వుంటానా అని ఎవరైనా అనుకుంటారు. కాని ఇది నా పరిణామదశ. ఈ మార్పుతో అది సరి - బోధపడుతూందా?... అబ్బే! ఎంత ప్రయత్నం నా నుంచి జరిగినా మీ పార్వతత్త నన్నసలు ఆకర్షించందే! నేనేం చెయ్యను."

నాకా - స్ఫుటంగా ఒకే రూపు గోచరిస్తున్నది. దేశంలో డబ్బూ, చదువూ లేక పెళ్ళీ జీవితమూ ఆగిపోయిన వేలాది ఆడపిల్లలందరికీ ప్రతినిధిగా నిలబడ్డ దౌర్భాగ్య దేవత పార్వతత్త! ఎన్నో విలువలున్న, ఎంతో కష్టపడి ఆకర్షిస్తే గాని దొరకబోని ఈ శంకరం మామయ్యనుంచి సభ్యతకోసం దూరంగా వెళ్ళి పోతున్న పార్వతత్త, నా సొంత మేనత్త!

నాన్నా, మామ్మా పై సంబంధాలు వెతకరు. ఈ శంకరం మామయ్యను కాస్తా నేను కట్టుకుపోతే పార్వతత్త మాటేమిటి; అస్పష్టంగా ఏదో గొణిగాను.

"దాన్ని గురించి నాకూ బెంగగానే వుంది. ఆ లెఖ్ఖని నాకు తన మీదున్న సింపతీ నీకూ లేదేమో. అందుకనే తనని నేను పెళ్ళాడతానని వలంటరీగా వొప్పుకున్నాను - కాని నాకూ కొన్ని ప్రాబ్లెమ్సు వున్నాయి. అవి నువ్వూ, నేనూ వుంటేగాని సాల్వుకావు-అందుకోసం ఈ మార్పులో పడవలసి వొచ్చింది. కాంట్ హెల్ప్!" అన్నాడు మామయ్య చాలా లోతుగా.

నాకేం తోచలేదు.

"ఏమిటి నీ సలహా? నన్నేం చెయ్యమంటావు?"

సిగ్గువెయ్యటం మొదలుపెట్టింది; ఎప్పుడూ లేంది! అంత సిగ్గులోనూ మామయ్య మొహం చూడాలన్న కోర్కె పుట్టింది. తలెత్తి చూశాను.

మామయ్య పరమేశ్వరుడి బొమ్మలా వున్నాడు; నిర్వికారంగా - చెప్పదల్చు కున్నదంతా చెప్పేసి జవాబుకోసం ఎదురుచూస్తున్నాడు. అతని బాహ్యదృష్టీ అంతర్దృష్టీ నామీదే, నాలోకే ఉన్నాయి.

"నీ సలహా చెప్పవా?" అని ప్రాధేయతను సూచించి నా చేతులు రెండూ మృదువుగా పట్టుకొన్నాడు.

"పోదాం మామయ్యా....." అన్నా కష్టపడి. మామయ్య అన్న సంబోధన అతనికి తగలాలని నొక్కి పలుకుతూ. అతనికది పట్టితేగా?

"అమ్మయ్యో, పోవడమే?-ఊహుఁ. మన సమస్య ఏం చెయ్యాలో చెబితేగాని పోవడం పట్టిది-ఏం, నీకింకా ఎప్లయి చేసుకోలేకపోతున్నావా? అందులో అర్థంలేదు. నీకు మట్టుకు పెళ్ళి కానక్కర్లేదూ? ఆ మాట నీకూ తెలుసనుకుంటాను....." అంటున్నాడు మామయ్య.

మామయ్య మాట కాదనడానికి. వున్న ప్రాపంచికాలోచనలు పోయి ఆదర్శాల్లోకి దిగిపోవాలి. చాతవుతుందేమో ఎవర్నైనా అడిగి చూడాలి. పాతికేళ్ళన్నా నిండని మామయ్య మానవయంత్రం ఊరికినే అంత వేడెక్కి పోయిందా?

*("ఆంధ్రపత్రిక వీక్లీ" ; నవంబరు 1958)*